
కథ

# శిక్ష-రక్ష

పాలంకి సత్య



డాక్టర్లందరిలోకీ గైనకాలజిస్టుల పని సులభమని అందరూ అనుకుంటూ వుంటారు. మిగిలిన డాక్టర్లకీ మరణంతో సన్నిహితం ఎక్కువ. గైనకాలజిస్టులకి పుట్టుకతో సంబంధం ఎక్కువ. అందుకే వాళ్లు ఆనందానికి దగ్గరగా వుంటారు. వాళ్లు ఎక్కువగా చేసే సిజేరియన్లూ, హిస్టరెక్టమీలలో కూడా ఫెయిలయ్యేవి తక్కువ. అందుకే గైనకాలజిస్టుల పని హాయి అంటారు కానీ వాళ్లకీ చేదు అనుభవాలుంటాయి. ఇలా అనుకుంటూ నేను క్లినిక్‌లో నా కుర్చీలో కూచుని పేషెంట్లని లోపలకు పంపమని నర్సుతో అన్నాను.

పేషెంట్లు వరుసగా లోపలకు వస్తున్నారు. చాలా మంది గర్భిణులే. పరీక్షలు చేసి, మందులు రాసి, జాగ్రత్తలు చెప్పి పంపిస్తున్నాను. లోపలకు ఒక తల్లీకూతుళ్లు వచ్చారు. తల్లికి యాభైపైనే వుండవచ్చు. అమ్మాయికి ఇరవై కన్నా ఎక్కువ వుండవు.

నేను సమస్య ఏమిటన్నట్లుగా చూశాను. ఇద్దరి మొహాల్లో భయం కనిపిస్తోంది. ఇద్దరూ మాట్లాడలేదు. అమ్మాయి ఎక్కడైనా మోసపోయి, నెల తప్పితే అబార్షన్‌కి వచ్చారా అని ఒక్క క్షణం అనిపించింది. నేను అబార్షన్ కేసులు టేకప్ చెయ్యనని చెప్పబోయి నన్ను నేనే నిభాయించుకున్నాను. విషయం తెలియకుండా నిర్ధారణ చెయ్యడం వృత్తి రీత్యా చాలా తప్పు.

"చెప్పమ్మా నీ పేరేమిటి?"

అమ్మాయి బెరుగ్గా 'రాధ' అంది.

"ఒంట్లో ఏమిటి ప్రాబ్లం?"

రాధ సమాధానం చెప్పలేదు. నేను ఆమె తల్లికేసి చూశాను. ఆమె కూడా ఒక్క క్షణం తటపటాయించింది. తరువాత నెమ్మదిగా బెరుగ్గా మాట్లాడింది.

"ఇది మా అమ్మాయి రాధ. బిఏ చదువుకుంది. నెల కిందటే పెళ్లి చేశాం." ఒక్క క్షణం ఆగి మళ్లీ చెప్పింది. "కట్నకానుకలు బాగానే ఇచ్చాం. పెళ్లి ఘనంగానే చేశాం. అంతా బాగానే అయింది అనుకుంటుండగా...."

ఆవిడ మళ్లీ ఆగింది. నేను భయంలేదు చెప్పండన్నట్లుగా చూశాను. ఆవిడ కళ్లలో నీళ్లు తిరుగుతుండగా "మా అల్లుడు మా అమ్మాయి రాధ కన్య కాదన్నాడు. ఇంతకు ముందే ఎవరితోనో సంబంధం వుందని అమ్మాయిని పంపించేశాడు" అంది.

నేను రాధకేసి చూశాను. చాలా అమాయకురాల్లా వుంది.

"అతనికలాంటి అనుమానమెందుకు వచ్చింది?"

తల్లీ కూతురూ కాసేపు మాట్లాడలేదు. తరువాత నెమ్మది నెమ్మదిగా ఇద్దరూ కలిసి చెప్పాక విషయం తెలిసింది. మొదటి రాత్రి రాధకి నొప్పి కలగలేదు. ఇంకే విధమైన ఇబ్బందీ లేదు. దాంతో ఆమె శీలాన్నే ఆ ప్రబుద్ధుడు శంకించాడు. నా ప్రాణం ఉసూరుమంది.

"మీరోసారి పరీక్ష చెయ్యండి. అమ్మాయి శరీరంలో లోపమేమైనా వుందేమో చూసి చెప్పండి."

"ఇందులో నేను పరీక్ష చెయ్యడానికేమీ లేదమ్మా. హైమన్ అనే సన్నటి పొర వుంటుంది. అది ఎప్పుడైనా చిరిగిపోవచ్చు. సైకిల్ తొక్కినా, ఆటలు ఆడినా కూడా చిరిగిపోవచ్చు. అందరి శరీరాలు ఒకేలా వుండవు. కన్యత్వానికి మీ అల్లుడనుకునే నిదర్శనాలేమీ వుండవు. మీరు భయపడాల్సిందేమీ లేదు. ఓసారి మీ అల్లుడిని తీసుకొస్తే అతనికీ వివరంగా చెప్తాను."


వాళ్ల ముఖాలు కొద్దిగా ఆశతో వికసించాయి. ఫీజు తీసి ఇవ్వబోతే నేను "నేనేం పరీక్షలూ అవీ చెయ్యలేదు. ఫీజు వద్దు. అతనికి మీరు వివరించినా సరే నా దగ్గరకు తీసుకువచ్చినా సరే" అన్నాను.

వాళ్లు నమస్కారం చేసి వెళ్లిపోయారు. తరువాత పేషెంట్ రావడంతో నేను పనిలో పడిపోయాను.

★★★

పేషెంట్స్‌ని పరీక్షించడం, డెలివరీలూ, సిజేరియన్సూ, హిస్టరెక్టమీలతో ఎంత బిజీగా వున్నా రాధ అమాయకమైన ముఖం నా కళ్లముందు అప్పుడప్పుడు కదుల్తూ వుండేది. ఆమె భర్త నా దగ్గరకు రాలేదు. బహుశా: అతనికి నచ్చజెప్పకలిగేరేమో అని సర్దిచెప్పుకున్నా అతనామెను ఇంకా హింసిస్తున్నాడేమో అని కూడా అనిపిస్తూండేది. రాధలా అజ్ఞానానికీ, అహంకారానికీ బలైపోయే అమ్మాయిలెందరో.

ఒక రోజురాధ లాంటి అమ్మాయిలని గురించి ఆలోచిస్తూ క్లినిక్‌లో అడుగు పెట్టాను. మొట్టమొదటిగా ఇద్దరమ్మాయిలు లోపలకు వచ్చారు. ఇద్దరిలో పేషెంటు ఎవరనుకుంటూ 'మీ పేరు' అన్నాను.



'రాధ' అంది మొదటి అమ్మాయి. ఒక్కసారిగా తలెత్తి చూశాను. ఈ అమ్మాయి ఆ రాధ కాదు. అయినా రాధ అన్నది చాలా సాధారణమైన పేరు.

"ఏమిటి ప్రాబ్లం?"

"నా పెళ్లి ఫిక్స్ అయింది. వచ్చేనెల ఆరున"

ఫామిలీ ప్లానింగ్‌కి సలహా కోసం వచ్చినట్లుంది.

"నాక్కాబోయే భర్త అమెరికాలో వున్నాడు. అమెరికాలో వున్న ఇండియన్ మగవాళ్లు చాలా బాక్‌వార్డ్‌గా వుంటారు కానీ ఫారినర్స్‌లా వుండరు"

విషయంలోకి రా అన్నట్లుగా చూశాను.

"నేను ఇంజనీరింగ్ చదివాను. అప్పుడో అబ్బాయి, నేను ప్రేమించుకున్నాం. లైఫ్ చాలా ఎంజాయ్ చేశాం. ఆ థ్రిల్ వేరు. సరే ఇప్పుడా గొడవెందుకు? ఇంతలో మా వాళ్లు ఈ పెళ్లి ఫిక్స్ చేసారు. అతను అక్కడ బిజినెస్ చేస్తున్నాడు. మూడు లక్షల డాలర్లు సంపాదిస్తున్నాడు. నేను ఓకే అన్నాను. నాకు అమెరికాలో ఎమ్‌ఎస్‌కి ఎలాగూ ఎయిడ్ రాదు. ఇప్పుడయితే అతను చదివిస్తానన్నాడు."

ఇంతకీ అసలు సంగతేమిటో తెలియరాలేదు. నాకెందుకో ఈ అమ్మాయి ప్రవర్తన నచ్చలేదు. కొన్ని నైతిక విలువలుండాలని నా నమ్మకం. అబార్షన్ కేసులు చూడకపోయినా నాకు మంచి ప్రాక్టీసుంది. నా సహ వైద్యుల్లో నాలా వున్న వాళ్లెందరు?

ఎందుకో ఆ క్షణంలో నాలోని డాక్టరు వెనక్కి వెళ్లి, వ్యక్తి ముందుకు వచ్చింది.

"నిన్ను ప్రేమించిన అబ్బాయి ఏం కావాలి?"

"ఏముంది నన్ను మర్చిపోతాడు"

"మర్చిపోలేకపోతే..."

"ఆత్మహత్య చేసుకుంటాడు. అదే నిజమయినా ఫర్వాలేదు. పిరికి వాళ్లు బతక్కూడదు. ఈలోకం ధైర్యవంతులదే."

నా ముఖంలోని కోపం గమనించిన రాధ ఫ్రెండ్ "ఈ గొడవెందుకు? విషయం చెప్పు" అంది.

రాధ " ఓకే... అసలు సంగతికి వస్తాను. మీతో ఇందాక చెప్పినట్లుగా అమెరికాలో వున్నా ఇండియన్ మెన్ చాలా బాక్‌వర్డ్. నువ్వు కన్యవు కావు పొమ్మంటే కష్టం. అందుకే మీరు స్టిచెస్ వేసేసి అంతా నార్మల్‌గా కనిపించేలా చెయ్యండి" అంది.

"నేను ఇంజనీరింగ్ చదివాను. అప్పుడో అబ్బాయి, నేను ప్రేమించుకున్నాం. లైఫ్ చాలా ఎంజాయ్ చేశాం. ఆ థ్రిల్ వేరు. సరే ఇప్పుడా గొడవెందుకు? ఇంతలో మా వాళ్లు ఈ పెళ్లి ఫిక్స్ చేసారు. అతను అక్కడ బిజినెస్ చేస్తున్నాడు. మూడు లక్షల డాలర్లు సంపాదిస్తున్నాడు. నేను ఓకే అన్నాను.

రాధతో వచ్చిన అమ్మాయి "కుందేలు చర్మం వాడి నార్మల్ చెయ్యొచ్చుట కదా. ఎంత ఖర్చయినా ఫరవాలేదు" అంది.

ఇద్దరి ముఖాల్లోనూ నిర్లక్ష్యం, ఏం కావాల్సినా ఎలాగైనా సాధించుకోగలమన్న ధీమా.

నేను కోపాన్ని నాలో నేనే జయించి "నేను ఇలాంటి కేసులు టేకప్ చెయ్యను" అన్నాను.

రాధ ఫ్రెండ్ "పదవే ఇంకో డాక్టర్ని ట్రై చేద్దాం" అంది.

ఇద్దరూ వెళ్లిపోయారు. నేను నిశ్చేష్టురాలినైపోయాను. తాసులోని రెండు పళ్లేలలో ఇద్దరు రాధలు కనిపిస్తున్నారు. చెయ్యని తప్పుకి శిక్ష అనుభవించిన రాధ. ఇంకా శిక్షని అనుభవిస్తూనే వుందా? తెలియదు.

చేసిన తప్పును రుజువులేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్న రాధ. ఎప్పటికీ శిక్షని తప్పించుకుంటుందా? అదీ తెలియదు.

త్రాసులోని ముల్లు లాగే నా మనస్సు ఇటూ అటూ ఊగుతూనే వుంది. ఎప్పటికైనా ఆగుతుందా? అసలే తెలియదు.

★